క్లుప్తంగా

ఏపీ 'శిల్పారామం' చైర్మన్‌గా చేర్రెడ్డి మంజుల



రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన చేర్రెడ్డి మంజులను ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరర్ సొసైటీ చైర్మన్‌గా నియమిస్తూ కూటమి ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలోని వరంగల్ జిల్లా చిట్టేల మండలం అడిగిపల్లి గ్రామానికి చెందిన మంజుల 10వ తరగతి వరకు చదువుకున్నారు. రెంటాల గ్రామానికి చెందిన చేర్రెడ్డి కోటిరెడ్డితో ఆమెకు వివాహం జరిగింది. కోటిరెడ్డి రెంటాల గ్రామ మాజీ సర్పంచ్. ప్రస్తుతం హైదరాబాద్‌లో పీజీ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో వారి కుటుంబం టీడీపీకి అనుకూలంగా పనిచేసింది.

ఓటరు నమోదు కేంద్రం సందర్శన



మాచవరం : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను శనివారం ఏర్పాటు చేశారు. ఓటు నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించారు. స్థానిక తహసీల్దారు క్షమారాణి 144 పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు తెలియజేశారు.

సత్రశాలలో భక్తుల ప్రత్యేక పూజలు



రెంటచింతల: మండలంలోని అతి పురాతన శైవ క్షేత్రమైన సత్రశాల శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా భక్తులు పరమేశ్వరుని అనుగ్రహం కోసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నస్వామి వారిని దర్శించుకున్న భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలదారులకు జెట్టిపాలెం గ్రామానికి చెందిన గుండా శ్రీనివాసరావు, అరుణకుమారి దంపతులు, ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి, కల్యాణి దంపతులు మహాన్నదానం చేశారు. అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలను, రుద్ర, గణపతి హోమాలను నిర్వహించారు. దాతలను ఈఓ గాదె రామిరెడ్డి ఘనంగా సన్మానించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

132 మందికి వైద్య పరీక్షలు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మైసూర్ ఫ్రీ మెడికల్ కేర్ ఉచిత గుండె వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ హారం రషీద్, పట్టణ సీఐ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం 132 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త సుబ్బారావు, టీడీపీ అధ్యక్షులు పాండురంగ శ్రీనివాసరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ బాబావలి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, సీనియర్ నాయకులు బాబావలి పాల్గొన్నారు.

డీఎస్పీకి వినతి



గురజాల : డీఎస్పీ బి.జగదీష్‌ను దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ సత్కరించారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గల ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు విచారణ జరపాలని కోరారు. పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భీమ్సేన, పేరుపోగు జార్జి, మాచవరపు నాగేశ్వరరావు, సిద్దెల బాబురావు, జి కాశయ్య తదితరులున్నారు.

భవిత బంగారం

- దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు
- మెరుగైన ఫలితాలు సాధిస్తున్న వైనం
- మధ్యాహ్న భోజన సౌకర్యంతో విద్య
- ఫిజియోథెరపీ సేవలతో మేలు



పిడుగురాళ్ల భవిత కేంద్రం



విద్యార్థికి ఫిజియోథెరపీ చేయిస్తున్న సిబ్బంది

పిడుగురాళ్ల: మానసిక, శారీరక దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు భవిత కేంద్రం ఉపయోగపడుతోంది. పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరిచేందు కు వ్యాయామం, ఫిజియోథెరపీని అందిస్తూ..మెరుగైన ఫలితాలను రాబడుతోంది. సమగ్ర శిక్ష అభయాన్ సమక్షంలో ఈ భవిత పాఠశాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. పట్టణంలోని ఈ ప్రత్యేక అవసరాలు గల పిల్లల శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి అక్షరాభ్యాసాలు నేర్పిస్తున్నారు. భవిత శిక్షణ కేంద్రాన్ని పట్టణంలో సుమారు గత 15 ఏళ్ల క్రితం నుంచి నిర్వహిస్తున్నారు. ప్రత్యేక భవనంలో వ్యాయామ పరికరాలను సమకూర్చి, 21 రకాల వైకల్యాలు గల విద్యార్థులకు ఇక్కడ విద్యా బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నారు. మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులకు ప్రైమరీ, ప్రీ ప్రైమరీ, సెంకడరీ, ప్రీ ఒకేషనల్, ఒకేషనల్ తరగతులను నిర్వహిస్తారు. ఇందులో మూడు సంవత్సరాల వయస్సు నుంచి 18 సంవత్సరాల వారికి వరకు విద్యతో పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. చెవిటి, మూగ విద్యార్థులకు 5వ తరగతి వరకు విద్యా బుద్ధులు నేర్పిస్తారు. శారీరక వైకల్యం కలిగిన వారికి ప్రతిరోజు ఉచితంగా ఫిజియోథెరపీ అందిస్తారు. అంధులకు బ్రెయిలీ లిపి ద్వారా విద్యను అందిస్తున్నారు. ఈ పాఠశాలలో పిడుగురాళ్ల పట్టణం, పిడుగురాళ్ల మండలం, రాజుపాలెం మండలం, మాచవరం మండలాలకు చెందిన విద్యార్థులు ఈ సౌకర్యాలను పొందుతున్నారు. ఈ శిక్షణ కేంద్రంలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఆయా విధులు నిర్వహిస్తున్నారు.



విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న ప్రత్యేకావసరాలు గల పిల్లలు

అన్ని సౌకర్యాలున్నాయి



భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల శిక్షణ కేంద్రంలో సౌకర్యాలన్ని ఉన్నాయి. ఏటా విద్యార్థులకు కావాల్సిన పరికరాలను, సమగ్ర శిక్షణ అభయాన్ ద్వారా కల్పిస్తున్నాం. విద్యార్థులకు యోగా, ఫిజియోథెరపీ, నడక నేర్పటం, మాట్లాడే విధానంతో పలు రకాల శిక్షణ అందిస్తూ విద్యార్థులకు విద్యను బోధిస్తున్నాం.

– ఎం.అజిత్‌కుమార్, ఐఈఆర్ టీచర్, పిడుగురాళ్ల

మెరుగైన శిక్షణ



పట్టణంలోని భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు సైగల ద్వారా తమకు చెప్పేది అర్థమవుతుంది. సులభంగా పాఠాలు నేర్చుకుంటున్నాం.

– వై.ఏడుకొండలు, ఎం.అజిత్‌నాయక్

చిన్నప్పటి నుంచి ఇక్కడే..




నేను చిన్నప్పటి నుంచి ఇక్కడే శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పుడు పదో తరగతి చదువుతున్నాను. శారీరక దృఢత్వం కోసం ప్రత్యేక ఫిజియోథెరపీ చేస్తున్నాను.

–ఉన్నం శ్రీను, 10వ తరగతి

మానసికంగా వేధిస్తున్నారు

సూసైడ్ లెటర్ రాసుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఎ.వెంకట కాశీరావు కార్యాలయ రిజిస్టర్‌లో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొంటూ రాసిన లెటర్ ఆలస్యంగా వెలుగు చూసింది. గత 7వ తేదీన కాశీరావు లాగ్ బుక్ (డైలీ దిన చర్య) బుక్‌లో రాసిన ఉత్తరం ఇది శనివారం వెలుగు చూసింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనను ఉద్యోగం మానేయాలని ఏడీఈ, సెక్షన్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎల్‌డీసీ వేధిస్తున్నారని అందులో పేర్కొన్నారు. తాను తప్పు చేసి ఉంటే శిక్షించండి కానీ ఏ తప్పు చేయకుండా ఉద్యోగం నుంచి తొలగించాలని చూస్తున్నారని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. పై అధికారులు తనను మానసికంగా వేధిస్తున్నారనీ, తన పొట్ట కొట్టి నన్ను ఒంటరి వాడిని చేయొద్దని, నాకు ఏమైనా జరిగితే దానికి వారిదే బాధ్యతని పేర్కొన్నారు. పై అధికారులు న్యాయం చేయాలని కోరాడు. వెంకటకాశీరావు ప్రకాశం జిల్లా కంభంకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. అయితే అతన్ని ఎందుకు తప్పించాలనుకుంటున్నారు దీనికి కారణాలేమిటనేది తెలియాల్సి ఉంది.



లాగ్ బుక్‌లో ఆత్మహత్య రాత

రొంపిచర్లలో సీపీఎం ప్రజాపోరు ప్రచార యాత్ర

ధరాబారాలపై కరపత్రాలు పంపిణీ

రొంపిచర్ల: కేంద్రంలో వరుసగా 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తోందని సీపీఎం రొంపిచర్ల మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం నిర్వహించిన ప్రజాపోరు ప్రచార యాత్రలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక ధరలను నియంత్రించి, నిత్యావసర ధరలను అందుబాటులోకి తీసుకురావాలని, విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రం రొంపిచర్లలో ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి ప్రజలపై విపరీతమైన నిత్యావసర ధరాభారం మోపుతోందన్నారు. ట్రూఅప్ పేరిట రూ.18 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలను ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 14 వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

మిరపలో ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలి

ప్రకృతి వ్యవసాయ స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్, జిల్లా శిక్షకుడు టి. సైదయ్య

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో ప్రకృతి వ్యవసాయ రైతు నాశన ఏడుకొండలు వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్, జిల్లా శిక్షకుడు టి. సైదయ్య ముఖ్యఅతిథులు పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట వేసే ప్రతి రైతు ఎకరాకు 400 కేజీల ఘనజీవామృతం వేయడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి జరుగుతుందని, తద్వారా మొక్కలకు అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి రావడంతో పాటు భూమి సారవంతమవుతుందన్నారు. ప్రధాన పంటతో పాటు అంతర పంటలుగా ఉల్లి, బంతి, ముల్లంగి, కొత్తిమీర ప్రతి రెండు మిరప మొక్కల తర్వాత మార్చిమార్చి వేసుకోవడం ద్వారా మిరప పంటను ఆశించే రైతులకు అపార నష్టం కలిగించే నల్ల తామర పురుగు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా పెట్టుబడులు, ఖర్చులు తగ్గుతాయని రైతు ఆర్థికంగా బలోపేతం అవుతాడని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ ఎంటీ తిరుపతి రావు, భాస్కరరావు, ప్రకాశరరావు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనల చేస్తున్న రామచంద్రన్, సైదయ్య

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

అమరావతి: సీపీఎం కార్యకర్త నందూరి వెంకటేశ్వర రాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన ఎండ్రాయి గ్రామంలో ప్రజా సమస్యలపై పనిచేసే వెంకటేశ్వరరాజుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గోరంట్ల నాగమల్లేశ్వరరావు రాజు, ఆయన కుమారుడు శివనాగశేఖర్ రాజు, బావమరిది వరప్రసాద్‌లు దాడి చేసినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గురజాల రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ పానల్ న్యాయవాది షేక్ జానీ బాష విద్యార్థులకు సూచించారు. గంగవరం గ్రామంలో శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవంను పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు ఆదేశాల మేరకు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు, ఆర్థిక రాజకీయ సమ న్యాయాన్ని అందించడం కోసం న్యాయ సేవ అధికార చట్టం అమలు చేయడం జరిగిందన్నారు. ఉచిత న్యాయ సహాయం కొరకు లోక్ అదాలత్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ పీర్‌అహ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బొజ్జమ్మ నియామకం సరికాదు

పిడుగురాళ్ల: రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం చైర్మన్‌గా బొజ్జమ్మను నియమించడం సరి కాదని వాల్మీకి బోయ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల నరసింహ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొజ్జమ్మ దొరలం, ఏపీ నాయుళ్లమంటూ పబ్లిక్ సమావేశంలో గతంలో ప్రకటించారు. రాష్ట్రమంతా 40 లక్షల మంది వాల్మీకి బోయలు ఉంటే, బోయలు కాని దొరలకు చెందిన బొజ్జమ్మను కార్పొరేషన్ చైర్మన్‌గా ఎలా నియమిస్తారంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీన్ని పల్నాడు జిల్లా నుంచి ఖండిస్తున్నామన్నారు. ఉద్యమాన్ని చేపడతామన్నారు.

ఆలయాల్లో అన్నదానం

మాచర్ల : కార్తిక మాసం పురస్కరించుకుని పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, జమ్మలమడక వెళ్లే రహదారిలో రామప్ప దేవాలయం, సొసైటీ కాలనీలోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయం, శ్రీశైలం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం, పట్టణ ప్రధాన రహదారిలోని కోదండ రామాలయం, బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయాలతోపాటు, వీరభద్ర స్వామి దేవాలయంలో గురుస్వామి సత్యం స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన, అభిషేకాలు నిర్వహించారు.

ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ

మాచర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి బూత్ లెవల్ అధికారులు ఓటరు దరఖాస్తులు స్వీకరించారు. పురపాలక సంఘ కార్యాలయం సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఫాం -6, 7, 8లు తీసుకుని, వారికి రశీదులు అందజేసి, కొత్త ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు తదితర అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పురపాలక సంఘ ప్రత్యేక పరిశీలన అధికారులు వెంగయ్య, రాజా పాల్గొన్నారు.



పేద విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం



మాట్లాడుతున్న బిగ్ హెల్ప్ చైర్మన్ చాంద్ పాషా

విజయపురిసౌత్: తెలుగు రాష్ట్రాల్లో పేద విద్యార్థుల అభ్యున్నతే బిగ్ హెల్ప్ ధ్యేయమని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ షేక్ చాంద్ పాషా అన్నారు. శనివారం బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ 22వ వార్షికోత్సవం విజయపురిసౌత్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చాంద్ పాషా తన సొంత నిధులు రూ.5 లక్షలతో తన సోదరుడు షేక్ ఖాదర్ బాష జ్ఞాపకార్థం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని ప్రారంభించారు. అనంతరం చాంద్ పాషా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 1,500 మంది పేద విద్యార్థుల అభ్యున్నతికి బిగ్ హెల్ప్ అండగా నిలిచిందన్నారు. అనంతరం నూతన ఆడిటోరియంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బిగ్ హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ సరోజిని మాటూరి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్ బాబు, ఆఫీస్ అడ్మిన్ కొత్తపేట శంకరయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లేష్, మేనేజర్ ధనలక్ష్మి, హెచ్ఎం కాంతారావు, వీపీ సౌత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కోట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

మాచర్ల : జాతీయ న్యాయ సేవా దినోత్సవం మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో మాచర్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల ప్రభుత్వ న్యాయవాది జీవీ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో చట్టాల గురించి సామాన్య ప్రజానీకానికి తెలియ చెప్పాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉచిత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. సీనియర్ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావంతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మండల న్యాయ సేవా కమిటీ సభ్యుడు, శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, భవిష్యత్తులో సమస్యలను ఎలా ఎదుర్కోవాలనేది విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకొని క్రమశిక్షణ, దేశభక్తితో పేద ప్రజల కోసం, సమాజం కోసం, దేశం కోసం సేవ చేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణ మహోత్సవం

మాచర్ల: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, ఆలయ ధర్మకర్తలు బోయరామిరెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగింపుగా కల్యాణ మహోత్సవ మండపంలో కూర్చొబెట్టారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాలల హక్కుల పరిరక్షణ ముఖ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కె.నాగేంద్రరావు

క్రోసూరు: క్రోసూరు మండలంలోని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. క్రోసూరు, బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, అందుకూరు, బాలమర్రు గ్రామాల నుంచి 120 మంది విద్యార్థులు శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐ కె.నాగేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని కోరారు. బాలల హక్కు పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. తర్వాత విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో అడ్మిస్ట్రేషన్, కంప్యూటర్ రూమ్ రికార్డ్స్ గది, లాకప్ రూమ్, స్టేషన్ పనితీరును వివరించారు.

ఆధ్యాత్మిక ప్రయాణం

ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీల్లో శైవ క్షేత్రాలకు సర్వీసులు



గురజాల బస్టాండ్‌లో ప్రయాణికులు

గురజాల: హిందువులకు కార్తిక మాసం ఎంతో ప్రాముఖ్యత కలిగినది. కార్తిక స్నానాలు, వన భోజనాలు, ఉప వాసాలు వంటివి చేసి శైవ క్షేత్రాలను దర్శించుకుని శివ నామాస్మరణతో భక్తిభావంతో ఉంటారు. ప్రతి ఏడాది కార్తిక మాసం పురస్కరించుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది అనేక ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. భక్తులకు అన్నివిధాల సౌకర్యాలు కల్పించి, టూర్ ప్యాకేజీలను రూపొందించారు. పిడుగురాళ్ల బస్టాండ్ నుంచి వివిధ సమయాల్లో శబరిమలైతో పాటు ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించుకునేందుకు సిద్ధం చేశారు.

సర్వీసులు ఇలా

పిడుగురాళ్ల బస్సు డిపో నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం నుంచి శైవక్షేత్రాలను ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి.

- పంచారామ క్షేత్రాలు సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి క్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్: పెద్దలకు రూ.1,100/, చిన్నారులకు రూ.750, డీలక్స్: పెద్దలకు రూ.1,250, చిన్నారులకు రూ.850, సూపర్ లగ్జరీ: పెద్దలకు రూ.1,350, చిన్నారులకు రూ.900ల చార్జీలు తీసుకుంటున్నారు.
- త్రిశైవ క్షేత్రాలు మహానంది, యాగంటి, శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్: పెద్దలకు రూ.1,150, చిన్నారులకు రూ.800, డీలక్స్ పెద్దలకు రూ.1350, చిన్నారులకు రూ.900, సూపర్ లగ్జరీ పెద్దలకు రూ.1,450, చిన్నారులకు రూ.1000లు.
- అన్నవరం క్షేత్రాలకు అన్నవరం, ద్వారకా తిరుమలకు ఎక్స్‌ప్రెస్: పెద్దలకు రూ.1,150, చిన్నారులకు రూ.800, డీలక్స్ పెద్దలకు రూ.1,350, చిన్నారులకు రూ.900, సూపర్ లగ్జరీ పెద్దలకు రూ.1,450, చిన్నారులకు రూ.1000లు.
- అరుణాచల గిరి ప్రదక్షణం శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, రెండు పగలు, రెండు రాత్రులు ప్రయాణం రూ.2,550లు, శబరిమల యాత్రకు 5/7 రోజులు ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోండి

కార్తిక మాసం పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలను అందుబా టులోకి తీసుకువచ్చింది. ఈ అవకాశాన్ని భక్తులు సద్వి నియోగం చేసుకో వాలి. పంచారామ క్షేత్రాలు, త్రిశైవ క్షేత్రాలు, అన్నవరం క్షేత్రాలతో పాటు అరుణచల గిరిప్రదక్షిణ, శబరిమల వంటి పుణ్యక్షేత్రా లు వెళ్లి దైవ దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది.

–బి.కోటేశ్వరనాయక్, ఆర్టీసీ డిపో మేనేజర్, పిడుగురాళ్ల